క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

గుమ్మలక్ష్మీపురం: వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పంచాయతీ పరిధిలో పరిశుభ్రతపై దృష్టి సారించినట్లు దుడ్డుఖల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి, కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దుడ్డుఖల్లు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ పనులు చేయించారు. అలాగే గ్రామంలోని కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఏఎల్‌వో చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీ సీట్లు మోడల్ విద్యార్థులు

భామిని: మండలానికి చెందిన పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 8 మంది విద్యార్థులు భామిని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన వారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బాబూరావు, తదితరులు అభినందించారు. బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి ఒకరు, పెద్ద దిమిలికి చెందిన మరో విద్యార్థికి సీట్ వచ్చినట్లు తెలిపారు.

సత్కరించడం మన బాధ్యత

వీరఘట్టం: పాఠశాలలో పనిచేసి వేరొక పాఠశాలకు బదిలీపై వెళ్లే ఉపాధ్యాయులను సత్కరించుకోవడం సహోపాధ్యాయుల బాధ్యతని ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. మండలంలోని పాలమెట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన నలుగురు ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం మరడాన సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూములు అప్పగించాలి

వీరఘట్టం: మండలంలోని నర్సిపురం గ్రామ పేదలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను అప్పగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నర్సిపురం గ్రామస్తులతో కలసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు, నర్సిపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోమయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కె.ధర్మారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న తామంతా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్ష అభియాన్, హౌసింగ్ ఇలా అనేక విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ సర్వేలను, బీఎల్‌వో విధులను కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఆరేళ్లుగా ప్రభుత్వ సర్వీసులో కొనసాగుతున్నా ఇప్పటి వరకు ప్రమోషన్లు ఇవ్వలేదని తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి


రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం చిట్టపులివలస గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సబ్సిడీపై పలువురు రైతులకు విత్తనాలను అందజేశారు.

కొలతల మేరకు పనులు చేపట్టాలి


రేగిడిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గుమ్మలక్ష్మీపురం: కొలతల మేరకు పనులు చేపట్టి నిర్దేశించిన దినసరి వేతనాన్ని పొందుకోవాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు ఉపాధి హామీ పథకం వేతనదారులతో అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బాలేసు పంచాయతీ పరిధిలోని రేగిడి గ్రామ పరిసరాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ మేరకు కొలత మేరకు పనులు చేపడుతున్నదీ.. లేనిది, మస్తర్లలో నమోదైన పేర్ల మేరకు కూలీలు హాజరైనదీ లేనిది క్షుణ్ణంగా పరిశీలించారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.


మండలంలోని భాసూరు వయా దోలమడ గ్రామాల మధ్య గోతులు


ప్రమాదకరంగా మంగళాపురం - యరకరాయపురం రహదారి


పాలకొండ వయా లుంబూరు - ఓని గ్రామాలకు ఈ రోడ్డుపైనే ప్రయాణం చేయాలి


రాజాం, వీరఘట్టం వెళ్లే ప్రధాన కూడలిలో పరిస్థితిది..


సింగుపురం నుంచి గిరిజనవలస గ్రామాలకు వెళ్లే రహదారిలో గోతులు

రహదారుణాలు

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రహదారులను అద్దంలా మెరిపిస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రయాణికుల రాకపోకల కష్టాలు తీరుస్తామని గొప్పలకు పోయారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా రహదారుల అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యం. పట్టణ, గ్రామీణ ప్రాంత రహదారుల పునరుద్ధరణకు మోక్షం లేకపోవడంతో ప్రజలు నిట్టూరుస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పల్లెపండగ పేరిట ఆర్భాటాలు చేశారే తప్ప రహదారులను బాగు చేయలేకపోయారని ప్రజలు మండిపడుతున్నారు. కూటమి నాయకులు గ్రామాలకు వెళ్లడానికి కూడా ధైర్యం చేయలేకపోతున్నారు. రహదారులను ఎప్పుడు అభివృద్ధి చేస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– పాలకొండ రూరల్

ప్రజల పక్షాన మరింత బలంగా పోరాడాలి..



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, పార్టీ తాజా స్థితిగతులను జగన్ మోహన్‌రెడ్డికి వివరించారు. రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం తీరు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వాటిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రెండు నియోజకర్గాల్లో చేపట్టిన కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రానున్న రోజుల్లో ప్రజల పక్షాన మరింత బలంగా పోరాడాలని ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి తమకు సూచించారని ఎమ్మెల్సీ విక్రాంత్ తెలిపారు. పాలకొండ రూరల్

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీ వైస్ చైర్మన్



గరుగుబిల్లి: ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలను ఆయనతో చర్చించారు. పార్టీని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, ప్రతీ కార్యకర్తకు భరోసాను కల్పిస్తూ పని చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఆయన బుధవారం తెలిపారు.

ఏడాదంతా.. పంటలు దిగుబడి చేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా తమకున్న విస్తీర్ణంలో 365 రోజుల పాటు పంటలు సాగు చేస్తూ ఆదాయం సమకూర్చుకోవాలని ఏవో పి.శంకరరావు అన్నారు. మండలంలోని ఒప్పంగి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వివిధ పంటల సాగు, యాజమాన్య పద్ధతుల గూర్చి వివరించారు. పోడు భూముల్లో ఆరుతడి పంటైన రాగులు, కంది, కొర్రలు వంటివి సాగు చేసుకోవడం ఉత్తమమన్నారు. రసాయన ఎరువుల జోలికి పోకుండా ప్రకృతి వ్యవసాయం విధానాలతో పంటలను ఏడాది పొడవునా సాగు చేసుకోవడం ఉత్తమమన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండవాడ సర్పంచ్ ఎం.కృష్ణారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అర్జునరావు, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇంచార్జ్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కళిగొట్టును సందర్శించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు


ఎస్.కళిగొట్టు గ్రామస్తుల జీవన విధానాలను తెలుసుకుంటున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కళిగొట్టు గ్రామాన్ని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామయ్య, శ్రీవాణిల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళిగొట్టు గ్రామస్తుల జీవన విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళిగొట్టు గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం తదితర వాటిపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రైతులకు అందుబాటులో వీపీఏలు

సీతంపేట: గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు (వీఏఏ) రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి రాబార్ట్ పాల్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వీఏఏలతో సమావేశమయ్యారు. విత్తనాల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని సూచయించారు. ఇప్పటివరకు సీతంపేట ఏజెన్సీలో 1510 క్వింటాళ్ల వరి విత్తనాలు, 62 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో 250 క్వింటాళ్ల వరి విత్తనాలు అదనంగా తెప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి వాహిని పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


పోగొట్టుకున్న పర్స్‌ను అందిస్తున్న డిపో మేనేజర్, ఉద్యోగులు

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కేజీ రావు ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్స్‌ను అందించి తన నిజాయితీ చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పొందూరు మండలానికి చెందిన అరవెల్లి రమేష్ మంగళవారం వైజాగ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి పొందూరు వరకు ప్రయాణం చేశారు. ఈ సమయంలో తన పర్సును బస్సులో పడిపోయింది. డిపోకు బస్సు చేరిన సమయంలో డ్రైవర్ కేజీ రావు పర్స్‌ను గుర్తించి దానిని చూడగా అందులో సుమారుగా 4 వేల నగదు, ఏటీఎం, ఆధార్ కార్డులతో పాటు మరికొన్ని కార్డులున్నాయి. దీంతో ఆ పర్స్‌ను డిపో ప్రధాన గేట్ వద్ద సెక్యూరిటీకి అప్పగించారు. దీంతో పర్స్‌లో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ప్రయాణికుడికి ఫోన్ చేసి డీఎం పట్నాల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె


జీపు జాతాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: దేశ వ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపునిచ్చారు. మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాత బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల నాయకుడు కె.గౌరీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని, కార్పొరేట్లకు అనుకూల విధానాలు చేస్తూ, కార్మికులకు నష్టం చేస్తున్నాయన్నారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు వి.ఇందిర, జి.జ్యోతి, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సీతంపేట: వచ్చేనెల 9న జరగనున్న దేశావ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. జీపుజాతా కార్యక్రమం బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, కె.రాము, హిమప్రభ, గౌరి,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపుజాతాలో భాగంగా పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి. తేజేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి మన్మధరావు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాస్, గిరిజన సంఘ నాయకుడు ఎం. తిరుపతిరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి స్కీమ్ వర్కర్లకు కనీసం రూ. 26 వేల వేతనం ఇవ్వాలని.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీపుజాతా ఈ నెల 27 వరకు జిల్లాలో కొనసాగుతుందని... చివరి సమావేశం సాలూరులో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వి. ఇందిర, జి. జ్యోతి, కె. గౌరీశ్వరి, ఎన్. హిమప్రభ, కె. రాము, కండాపు ప్రసాదరావు, జి. శారద, శ్రీదేవి, దూసి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

పాలకొండ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ ఎం. రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు రక్తదానం శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారున. రెడ్‌క్రాస్ ప్రతినిధులు జగన్ మోహనరావు, పెంకి చైతన్యకుమార్, కె. సత్యనారాయణ, జి. రమణ రక్తదానం కోసం ఏర్పాట్లు చేయగా.. 75 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఉదయ్‌కుమార్, కిశోర్, వెంకటరమణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో గ్రామీణ వైద్య సిబ్బంది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల వివరాలు, ఓపీ విభాగం, రోజువారీ నివేదికలపై చర్చించారు. ముఖ్యంగా మలేరియా, డయేరియా, వైరల్ జ్వరాలు అదుపు చేసే విషయంలో ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి పరిధిలో సర్వేలు చేపడుతూ వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పౌష్టికాహారం, సురక్షిత నీరు, పరసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని వల్లరగుడబ, చినగుడబ గ్రామాలలో నిర్వహిస్తున్న రిక్షాలలో తడి పొడి చెత్త సేకరణను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు ప్రబలితే మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం వుంటుందన్నారు. ప్రతీ రోజు ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ రిక్షాలకు చెత్తను ఇవ్వాలన్నారు. కాలువలలో చెత్తను వేయడం వల్ల మురుగు నీరు పారేందుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. కార్యదర్శి టి.భాస్కరరావు తదితరులున్నారు.

బీజామృతం పంటలకు అమృతం

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి గ్రామంలో సామూహిక బీజామృతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ బీజామృతంతో విత్తనశుద్ధి పంటల దిగుబడులకు అమృతం వలే పని చేస్తుందని, వర్షాలు సకాలంలో పడుతున్నందున రైతులు తమ విత్తనాలు విత్తేటప్పుడు ఏ విధమైన పురుగులు, తెగుళ్లు రాకుండా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వలన గాలి, నీటిద్వారా విత్తనం ద్వారా సంక్రమించే హానికర సూక్ష్మజీవులు నుంచి రక్షణ పొందుతాయన్నారు. విత్తనాలను బీజామృతంతో కలియబెట్టి రెండు గంటల పాటు నీడలో ఆరబెట్టిన తరువాత నారుమడిలో వేస్తే మొలకశాతం 100 శాతం వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా దేవాలయాల పరిరక్షణ

భామిని: రాజకీయాలకు అతీతంగా హిందూ దేవాలయాలను పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు శివశంకర్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భాస్కరనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులతో ఆలయాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో కె. రాజారావు, వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో లాభాలు


సీతంపేట: ఆయిల్‌పామ్ మెగా మేళా నిర్వహిస్తున్న హెచ్ఓ జయశ్రీ

భామిని: పామాయిల్ సాగు చేసే రైతుకు దీర్ఘకాలిక లాభాలు ఉంటాయని సీతంపేట హెచ్‌టీఓ పేడాడ జయశ్రీ అన్నారు. మండలంలోని బత్తిలిలో రైతు సుబ్బారావు చౌదరికి చెందిన పొలంలో బుధవారం పామాయిల్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీనివాస పామాయిల్ ఫ్యాక్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ తవిటినాయుడు, బత్తిలి వ్యవసాయ సహాయకుడు దినేష్, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన ఆదాయం..

సీతంపేట: ఆయిల్‌పామ్ సాగుతో మెరుగైన ఆదాయం వస్తుందని హార్టికల్చర్ అధికారి పేడాడ జయశ్రీ అన్నారు. మండలంలోని కుడ్డపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ మెగామేళా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు రాత పరీక్ష


రాతపరీక్షను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: సూపర్50 ప్రత్యేక బ్యాచ్ నిర్వహించేందుకు పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 162 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. స్టేట్ పరిశీలకుడు టి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, డిప్యూటీ ఈఓ జి.రామ్మోహనరావు, ఏఎంఓ కోటిబాబు, హెచ్ఎం టి.చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.